# కులవృత్తులపై కాంగ్రెస్ నిర్లక్ష్యం

- మత్స్యసంపదను పెంచి, ఉపాధి కల్పించిన ఘనత సీఎం కేసీఆర్‌దే
- గంగపుత్రుల ఆత్మీయ సమ్మేళనంలో రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్



బాజిరెడ్డి గోవర్ధన్, వీజీ గౌడ్‌కు చేపలను బహూకరిస్తున్న గంగ పుత్రులు

డిచ్‌పల్లి, అక్టోబర్ 30 : ఉమ్మడి రాష్ట్రాన్ని 50 ఏండ్లు పాలించిన కాంగ్రెస్ నాయకులు కులవృత్తులను సర్వనాశనం చేశారని రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ మండిపడ్డారు. తెలంగాణ ఏర్పడిన తర్వాత సీఎం కేసీఆర్ అన్ని కులాలకు ఉపాధి అవకాశాలు కల్పించి పూర్వవైభవం తెచ్చారని తెలిపారు. మండల కేంద్రంలోని జీ-కన్వెన్షన్ హాల్‌లో ఆదివారం నిర్వహించిన నిజామాబాద్ రూరల్ నియోజకవర్గ గంగపుత్రుల ఆత్మీయ సమ్మేళనానికి బాజిరెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. అర్సపల్లిలో విలువైన మత్స్యశాఖ భూమిని కబ్జా కాకుండా తానే కాపాడినట్లు తెలిపారు. ఆ స్థలంలో చేపల మార్కెట్ కోసం రూ.2కోట్ల నిధులు మంజూరు చేయించానన్నారు. రూరల్‌లో వంద మత్స్యకార సొసైటీల్లో 2వేల మంది సభ్యులున్నారని తెలిపారు. మత్స్యకారులంటే తనకు అమితమైన ప్రేమ అని అన్నారు. జిల్లాలో ఏకైక బీసీ నాయకుడిగా తనను ఆదరించి గెలిపించాలని కోరారు. ప్రజలకు ఏ కష్టం వచ్చినా ఆదుకుంటానని హామీ ఇచ్చారు. రూరల్ నియోజకవర్గంలో 80 దేవాలయాల అభివృద్ధికి నిధులు మంజూరు చేయించినట్లు తెలిపారు. బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, రూరల్ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్సీ వీ.గంగాధర్‌గౌడ్ మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా 35 వేల చెరువుల్లో ఉచితంగా చేపపిల్లలు విడుదల చేసిందని తెలిపారు. దీంతో తొమ్మిదన్నర ఏండ్ల కాలంలో 6500 కోట్ల చేపలను ఉత్పత్తి చేసి దేశంలోనే తెలంగాణ రికార్డు సాధించిందన్నారు. మత్స్యకార్మికులకు చేపల రవాణా, వ్యాపారం కోసం వాహనాలు అందజేసినట్లు చెప్పారు. ఎన్నికల్లో కాంగ్రెస్, బీజేపీని చిత్తుగా ఓడించాలని పిలుపునిచ్చారు. సీఎం కేసీఆర్‌నే ఓడిస్తానని టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి అనడం హాస్యాస్పదమన్నారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ చైర్మన్ సాంబారి మోహన్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు చింత శ్రీనివాస్‌రెడ్డి, బీసీ సంఘం జిల్లా అధ్యక్షుడు నరాల సుధాకర్, మత్స్యకార సంఘం జిల్లా అధ్యక్షుడు నారాయణ, నాయకులు బాల గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్ సమక్షంలో 500 మంది చేరిక

కామారెడ్డి,అక్టోబర్ 30 : కామారెడ్డి మున్సిపల్ పరిధిలోని 1,2,17 వ వార్డులకు చెందిన 200 మంది, కామారెడ్డి మండలం చిన్నమల్లారెడ్డి, ఇస్రోజివాడి,దోమకొండ మండలం చింతామన్‌పల్లి,రామారెడ్డి మండలం రెడ్డిపేట్ గ్రామాలకు చెందిన సుమారు 300 మందికి ప్రభుత్వ విప్ గంపగోవర్ధన్ సమక్షంలో సోమవారం బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా జిల్లా కేంద్రంలోని బృందావన్‌గార్డెన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో విప్ మాట్లాడుతూ..కారు గుర్తుకు ఓటు వేసి కేసీఆర్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు.




బీఆర్ఎస్‌లో చేరిన వారితో ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్

# షాదీముబారక్ దేశానికే ఆదర్శం

- బీఆర్ఎస్ ప్రభుత్వంతోనే అభివృద్ధి సాధ్యం
- ఆదరించి.. ఆశీర్వదించండి
- ముస్లింల ఆత్మీయ సమ్మేళనంలో అర్బన్ ఎమ్మెల్యే బిగాల



కార్యక్రమంలో మాట్లాడుతున్న అర్బన్ ఎమ్మెల్యే బిగాల గణేశ్‌గుప్తా

ఖలీల్‌వాడి, అక్టోబర్ 30: ఆడపిల్లల పెండ్లి చేసి ముస్లిం కుటుంబాలకు సీఎం కేసీఆర్ అందజేస్తున్న షాదీ ముబారక్ పథకం దేశానికే ఆదర్శంగా నిలిచిందని నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే బిగాల గణేశ్‌గుప్తా అన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వంతోనే నిజామాబాద్ నగరం, రాష్ట్ర అభివృద్ధి సాధ్యమని తెలిపారు. ప్రజలు తనను ఆదరించి మరోసారి గెలిపించాలని కోరారు. నగరంలోని హైమద్‌పురా కాలనీలో 55, 56 డివిజన్లకు చెందిన ముస్లిం మైనారిటీలతో సోమవారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే హాజరై మైనారిటీల సంక్షేమం కోసం బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేస్తున్న కార్యక్రమాలను వివరించారు. షాదీ ముబారక్, మైనారిటీ బంధు పథకాలతోపాటు విద్యార్థుల కోసం మైనారిటీ రెసిడెన్షియల్ స్కూళ్లను ఏర్పాటుచేసి ఉచితంగా విద్యను అందిస్తున్నట్లు చెప్పారు. నగరంలో చేపట్టిన అభివృద్ధి పనులను వివరించారు. మరోసారి బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చిన వెంటనే ఆసరా పింఛన్లు పెరుగుతాయని, కొత్తగా పేదల మహిళలకు సౌభాగ్యలక్ష్మి పథకం, కుటుంబాలకు ఉచితంగా బీమా సౌకర్యం, రేషన్ ద్వారా సన్నబియ్యం అందజేయనున్నట్లు తెలిపారు. కారు గుర్తుకే ఓటేసి తనను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో నగర మేయర్ దండు నీతూ కిరణ్, రెడ్కో మాజీ చైర్మన్ అలీం, మైనార్టీ నాయకులు మాజాజ్‌అలీ, నవీద్ ఇక్బాల్, కుద్దూస్, అక్బర్ హుస్సేన్, రవిచందర్, సిర్ప రాజు, సుజిత్‌సింగ్ ఠాకూర్, సత్యప్రకాశ్, నూడ మాజీ చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## సాలూర మండలం ఇచ్చాం..

# ఆశీర్వదించి గెలిపించండి

- బోధన్ ప్రజలకు సుదర్శన్‌రెడ్డి చేసిందేమీ లేదు..
- ఎమ్మెల్యే మహ్మద్ షకీల్

బోధన్, అక్టోబర్ 30: ప్రజలకు పాలనను మరింత చేరువగా తీసుకురావాలన్న ఉద్దేశంతో.. ప్రజల కోరిక మేరకు సాలూర మండలం ఏర్పాటు చేశామని, దీంతో ఈ మండలం ఎంతగానో అభివృద్ధి చెందే అవకాశం ఏర్పడిందని ఎమ్మెల్యే, బీఆర్ఎస్ బోధన్ నియోజకవర్గ అభ్యర్థి మహ్మద్ షకీల్ అన్నారు. సోమవారం సాలూర మండలం కేంద్రంలో బీఆర్ఎస్ మండలం ఎన్నికల కార్యాలయాన్ని ఆయన ప్రారంభించారు. అంతకు ముందు ఆయనకు స్వాగతం పలుకుతూ నాయకులు భారీ ర్యాలీ నిర్వహించారు. సభలో షకీల్ మాట్లాడుతూ సీఎం కేసీఆర్ నాయకత్వంలో అనేక సంక్షేమ పథకాలు అమలవుతున్నాయని అన్నారు. కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీచేస్తున్న సుదర్శన్‌రెడ్డి ఏనాడూ ప్రజలను పట్టించుకోలేదని మహ్మద్ షకీల్ ధ్వజమెత్తారు. ఇటువంటి వ్యక్తి ఇప్పుడు వచ్చి ఓటర్ల కాళ్లు పట్టుకుంటున్నాడని ఎద్దేవాచేశారు. కాంగ్రెస్, బీజేపీ నాయకుల మాటలు నమ్మి మోసపోవద్దని అన్నా రు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు బుద్దె రాజేశ్వర్, పార్టీ బోధన్ మండలం అధ్యక్షుడు గోనినేని నర్సయ్య, నియోజకవర్గ నాయకులు గిర్దావర్ గంగారెడ్డి, పి.రవికిరణ్, బోధన్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సాలూర షకీల్, సాలూర సొసైటీ చైర్మన్ అల్లె జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బోధన్ ఎమ్మెల్యే షకీల్

# సబ్బండ వర్గాలకు సంక్షేమ పథకాలు

- బీఆర్ఎస్ వచ్చాకే బీసీలకు స్వర్ణయుగం
- ఆర్మూర్‌లో మళ్లీ గెలుపునాదే
- ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి



మాట్లాడుతున్న ఆర్మూర్ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి


నందిపేట్, అక్టోబర్ 30: సీఎం కేసీఆర్ పాలనలో సబ్బండ వర్గాలకు సముచిత రీతిలో సంక్షేమ పథకాలు అందుతున్నాయని ఆర్మూర్ నియోజకవర్గ బీఆర్ఎస్ అభ్యర్థి, ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు ఆశన్నగారి జీవన్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని కుర్మ ఫంక్షన్ హాల్‌లో సోమవారం నిర్వహించిన ఆర్మూర్ నియోజకవర్గస్థాయి కుర్మ కులస్తుల ఆత్మీయ సమ్మేళనంలో ఆయన మాట్లాడారు. కుర్మ ఫంక్షన్ హాల్‌కు దాదాపు రూ.7కోట్లతో ఒకటిన్నర ఎకరాల స్థలం కేటాయించామని, ఫంక్షన్ హాల్ నిర్మాణానికి రూ.కోటీ 20 లక్షలు మంజూరు చేయించానని ఎమ్మెల్యే గుర్తు చేశారు. ఆర్మూర్ నియోజకవర్గంలో గ్రామాల వారీగా 26 సంఘాలకు రూ.2.84 కోట్లు నిధులిచ్చానన్నారు. బీఆర్ఎస్ వచ్చాకే బీసీలకు స్వర్ణయుగం మొదలైందని, సామాజికంగా రాజకీయంగా అవకాశాలు పెరిగాయని అన్నారు. కుర్మ కులస్తులను కంటికి రెప్పలా చూసుకుంటానని అన్నారు. కాంగ్రెస్‌ను నమ్మి మళ్లీ మోసపోతే గోస పడుతారని, కాంగ్రెస్, బీజేపీ నాయకుల మాటలు నమ్మవద్దని అన్నారు. కేసీఆర్ మూడోసారి సీఎం కాకుండా ఏ శక్తి ఆపలేదని, ఆర్మూర్‌లో మళ్లీ గెలుపు తనదేనని అన్నారు. తనకు అండగా నిలిచిన కుర్మ కులస్తులకు పాదాభివందనం చేస్తున్నానని అన్నారు. గొల్ల, కుర్మ, యాదవులకు హైదరాబాద్ సమీపంలోని కోకాపేట వద్ద రూ.300 కోట్ల విలువ చేసే భూమిని కేటాయించిన సీఎం కేసీఆర్.. భవన నిర్మాణానికి రూ.10కోట్లు మంజూరు చేశారని గుర్తు చేశారు. తనను మళ్లీ దీవించాలని జీవన్‌రెడ్డి కుర్మ కులస్తులకు విజ్ఞప్తి చేశారు.



మండలంలోని వెంకటాపూర్‌కు చెందిన జక్కుల సంఘం సభ్యులు మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డికి మద్దతుగా ఏకగ్రీవ తీర్మానం చేశారు. మంత్రి వెంటే ఉంటామని సంఘంలోని 19 కుటుంబాల సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా తీర్మాన కాపీని బీఆర్ఎస్ నాయకుడు సామ మహిపాల్‌కు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ మహేశ్ పాల్గొన్నారు. –వేల్పూర్, అక్టోబర్ 30

# పొరపాట్లకు తావులేకుండా పోలింగ్

**భారత ఎన్నికల సంఘం సీనియర్ డిప్యూటీ ఎలక్షన్ కమిషనర్ నితేశ్ వ్యాస్**



వీసీలో మాట్లాడుతున్న సీనియర్ డిప్యూటీ ఎన్నికల కమిషనర్ నితేశ్ వ్యాస్

నిజామాబాద్ స్పోర్ట్స్/ కామారెడ్డి, అక్టోబర్ 30 : శాసనసభ ఎన్నికలను పొరపాట్లకు తావు లేకుండా నిర్వహించేందుకు అధికారులు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని భారత ఎన్నికల సంఘం సీనియర్ డిప్యూటీ ఎలక్షన్ కమిషనర్ నితేశ్‌వ్యాస్ సూచించారు. రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల నిర్వహణ సన్నద్ధతపై రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్‌రాజ్, ఇతర ఉన్నతాధికారులతో కలిసి సోమవారం న్యూఢిల్లీ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. పోలింగ్ సందర్భంగా చేపట్టాల్సిన చర్యలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సూచించారు. రిటర్నింగ్ అధికారుల కార్యాలయంలో అన్ని ఏర్పాట్లు చేయాలని, నామినేషన్ల స్వీకరణలో సమయపాలన కచ్చితంగా పాటించాలని, ఒకే గడియారం ఉండాలన్నారు. అభ్యర్థులు సమర్పించే నామినేషన్ల వివరాలను క్షుణ్ణంగా పరిశీలించాలని, వెంటవెంటనే ఆన్‌లైన్ యాప్‌లో వివరాలను నమోదు చేయాలని సూచించారు. పోటీ చేసే ప్రతి అభ్యర్థికీ తప్పనిసరిగా ఓటరు, పోలింగ్ కేంద్రాల జాబితాలను అందించాలని, స్వతంత్ర అభ్యర్థులకు, గుర్తింపులేని పార్టీల అభ్యర్థులకు ఎన్నికల గుర్తులు కేటాయించేటప్పుడు అప్రమత్తంగా ఉండాలన్నారు. నామినేషన్లు ముగిశాక బ్యాలెట్ పేపర్ల తయారీ, బ్యాలెట్ యూనిట్లు, పోస్టల్ బ్యాలెట్స్ సిద్ధం చేసుకోవాలన్నారు. ఈవీఎంల స్ట్రాంగ్ రూం, డిస్ట్రిబ్యూషన్ కేంద్రాల వద్ద అన్ని వసతులు కల్పించాలన్నారు. నగదు, మద్యం పంపిణీ జరగకుండా మార్గదర్శకాలను తప్పకుండా పాటించాలన్నారు. రూ. 10 లక్షల కన్నా అధికంగా నగదు జప్తు చేసిన సమయంలో ఐటీ అధికారులకు సమాచారం అందించాలన్నారు. నవంబర్ 3 నుంచి ఎన్నికల పరిశీలకుల క్షేత్రస్థాయి పర్యటన ఉంటుందని తెలిపారు. నిజామాబాద్ వీసీలో కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు, సీపీ కల్మేశ్వర్, అదనపు కలెక్టర్లు పి.యాదిరెడ్డి, చిత్రామిశ్రా, కామారెడ్డిలో కలెక్టర్ జితేశ్ వీ పాటిల్,అదనపు కలెక్టర్ చంద్రమోహన్,నోడల్ అధికారులు కిషన్, సింహారావు, దయానంద్, బఫేవ్య, శ్రీనివాస్ పాల్గొన్నారు.